క్లుప్తంగా

సబ్సిడీ యంత్ర సామగ్రి పంపిణీ



ట్రాక్టర్, పనిముట్లు అందజేస్తున్న ఏఓ జయప్రకాష్ రెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన రైతులకు రాయితీపై ట్రాక్టర్, రోటావేటర్, గొర్రు పనిముట్లను రాయితీపై అందజేసినట్లు ఏఓ జయప్రకాష్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన 'భూమి పుత్ర' గ్రూప్‌నకు 50 శాతం రాయితీతో ట్రాక్టర్ రూ.3.75 లక్షలకు, రోటావేటర్ రూ.60 వేలకు, గొర్రును రూ.40 వేలకు అందించినట్లు తెలిపారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని వ్యవసాయ ఖర్చులను తగ్గించుకోవాలన్నారు. 'భూమి పుత్ర' గ్రూపు సభ్యులు, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకుడు శేషారెడ్డి, ఉద్యాన శాఖ అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మంపై విస్తృత ప్రచారం

ఓర్వకల్లు: హిందూ ధర్మంపై మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని పాలకొలను, గుట్టపాడు, హెచ్ కొట్టాల, చింతలపల్లె గ్రామాలలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన త్రైతసిద్ధాంత భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథాలను గురించి హిందూ జ్ఞానవేదిక ప్రబోధ సేవా సమితి వారు ప్రచారం చేశారు. చింతలపల్లె కమిటీ ఆధర్యంలో ఊరూరా ప్రచార కార్యక్రమాలతో గ్రంథాలను పంపిణీ చేశారు. పాలకొలనులో వైఎస్సార్‌సీపీ నాయకులు సేవా సమితి వారిని సాదరంగా ఆహ్వానించగా కరపత్రాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరు ఆధ్మాత్మిక మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రామచంద్రుడు, కుమార్‌ఆచారి, వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆసరా చెక్కు పంపిణీ

పాణ్యం: మండల కేంద్రంలో ఈ నెల 4న మూడవ విడత వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఏపీఎం ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పొదుపు సంఘాలకు అందిస్తున్న 'ఆసరా' సాయం వలన అనేక మంది ఆర్థికంగా పరిపుష్టి చెందినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 749 గ్రూపులకు గాను రూ.4.25 కోట్ల చెక్కును ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా అందిస్తారన్నారు. పొదుపు సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

సుంకేసులకు 330 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి సోమవారం 330 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాంలో 1.068 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కేసీ కాల్వకు 505 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

చలివేంద్రం ప్రారంభం



సి.బెళగల్‌లో చలివేంద్రంను ప్రారంభిస్తున్న అధికార యంత్రాంగం

సి.బెళగల్: స్థానిక బస్టాండ్ ఆవరణలో సోమవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ పాండురంగన్న ప్రారంభించగా, ముఖ్య అతిథులుగా తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎంపీడీఓ రాముడు హాజరై ప్రజలకు నీటిని అందజేశారు. అధికారులు మాట్లాడుతూ.. వేసవిలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు ఉపయోగ డేలా బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



కాలువలో మందు స్ప్రే చేస్తున్న దృశ్యం

కల్లూరు: ఇళ్లు, చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణమోహన్ సూచించారు. సోమవారం వైరల్ ఫీవర్ అనుమానంతో ఆయన బస్తిపాడు గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని కాలువల్లో దోమల లార్వాలు నిల్వ లేకుండా ఏఎల్ఓ (యాంటీ లార్వా ఆపరేషన్), పైరిత్రమ్ మందులను (స్ప్రే) పిచికారీ చేయించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వైరల్ జ్వరాలు ప్రబలకుండా ఉండాలంటే డ్రమ్ములు, గచ్చులు, నీటి తొట్లు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. సచివాలయ ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే కోన వేంకటేశ్వరుడు

- నేడు గరుడ సేవతో స్వామి వారి ఉత్సవాలు ప్రారంభం
- ఐదు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు

సి.బెళగల్: మండలం పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో కొండపై కొలువైన కోన వేంకటేశ్వరుడు కొలిచిన వారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. ఇక్కడి తిరునాల మండలంలోనే పెద్ద ఉత్సవంగా పేరొందింది. స్వామి వారి బ్రహ్మోత్సవాలు 4వ తేదీ గరుడసేవతో ప్రారంభమై ఐదు రోజుల పాటు వివిధ ప్రత్యేక కార్యక్రమాలతోకొనసాగి 9వ తేదీ బండలాగుడు పోటీలతో ముగుస్తాయని ఆలయ ధర్మకర్తలు, నిర్వాహకులు తెలిపారు.

భారీగా తరలిరానున్న భక్తజనం

స్వామి వారిని కొలిచిన వారికి కొంగు బంగారమే, అన్ని శుభాలే జరుగుతాయి అన్నది భక్తుల ప్రగాఢ నమ్మకం. మండలంలోని సి.బెళగల్, బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి, పోలకల్, కంబదహాల్, సంగాల, ఇనగండ్ల, గ్రామాల వారే గాక కోడుమూరు, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, గూడూరు మండలాలకు చెందిన 30కి పైగా గ్రామాలతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారని నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే గ్రామంలో ఆట వస్తువులు, మిఠాయి, వినోద స్టాళ్లు, రంగుల రాట్నం వంటివి వెలిశాయి.

స్వామి వారి చరిత్ర

తెలంగాణకు చెందిన కొందరు కోడుమూరు మండలంలోని కొండలరాయుడి కొండపై ఉన్న వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని దొంగిలించుకుని సంచిలో తీసుకెళుతుండగా చీకటి పడటంతో స్థానిక కొండపై విశ్రమించారు. తెల్లవారిన తరువాత తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా విగ్రహం బరువు పెరిగి ఎంతకీ రాకపోవడంతో అక్కడే వదలి వెళ్లారు. తర్వాత గొర్రెలను మేపుకుంటూ అక్కడికి వెళ్లిన కాపర్లు స్వామివారి విగ్రహాన్ని గుర్తించి గుడి నిర్మించి పూజలు చేయడం ప్రారంభించారని పురాతన కథ ప్రచారంలో ఉంది.



క్రిష్ణదొడ్డి కొండపై ఆలయంలో అలివేలు, పద్మావతి సమేత శ్రీవారు

ఏటా పెరుగుతున్న ఆదరణ

కోన వేంకటేశ్వర స్వామి వారికి ఏటా ఆలయంలో నిర్వహించే కార్యక్రమాలతో పాటు భక్తుల సంఖ్య, ఆదరణ పెరుగుతూ వస్తుంది. తిరుమల ఆలయం తరహాలో ఇక్కడ కార్యక్రమాలను నిర్వహిస్తుండడం విశేషం. ప్రతి శనివారం శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు దసరా, ఉగాది పర్వదినాలు, తొలిఏకాదశి, ముక్కోటి ఏకాదశి, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయాల్లో ప్రత్యేక పూజలు, మూడు నెలల శావ, జనవరి కొత్త సంవత్సర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.



కోన వేంకటేశ్వరని రథం (ఫైల్)

కర్నూలు తిరుపతిగా ప్రసిద్ధి

తిరుమల వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకోలేని భక్తులు కర్నూలు తిరుమలగా ప్రసిద్ధి చెందిన క్రిష్ణదొడ్డి కోన వేంకటేశ్వరుడి సన్నిధికి వచ్చి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లిస్తుండడం విశేషం. స్థానికులే గాక ఇలవేల్పుగా ఉన్న భక్తులు ఇక్కడి శ్రీవారి సన్నిధిలో వివాహాది శుభకార్యాలు ఘనంగా నిర్వహించుకుంటారు. చిన్నారుల కేశఖండన కార్యక్రమాలు కూడా జరుపుకుంటున్నారు.

ఉత్సవ వివరాలు

శోభకృత్ నామ సంవత్సరం చైత్ర శుద్ధ త్రయోదశి ఈ నెల 4న సాయంత్రం స్వామి వారికి గరుడోత్సవం, 5న శ్రీవారి కల్యాణ మహోత్సవం, రాత్రి 2:06 గంటలకు స్వామి వారి ప్రభోత్సవం, 6న మహాఘటాభిషేకం, పంచామృతాలు నిర్వహించి, రథాంగ హోమం, పూర్ణాహుతి, రాత్రి 2 గంటలకు గణపతి పూజ, 3 గంటలకు కుంభం నిర్వహిస్తారు. 7న తెల్లవారుజామున 3:55 నుంచి 5:25 గంటలకు రథోత్సవం, 7న అశ్వ, గజారోహణంతో పారువేట, 8న వసంతోత్సవం అనంతరం చక్ర స్నానం, 9న పాలపండ్ల వృషభాల బండలాగుడు పోటీలు ఉంటాయి. ఉత్సవాలు జరిగే అన్ని రోజుల్లో భక్తుల సౌకర్యార్థం స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు పింఛన్ల పంపిణీ

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 4వ తేదీ నుంచి కర్నూలు మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ పింఛను కానుకను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు కర్నూలు ఎంపీడీఓ ఎస్.భాస్కర్‌నాయుడు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, డప్పు కళాకారులు, హిజ్రాలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు మొత్తం 10,080 మందికి రూ.2,81,41,000 సొమ్ము మంజూరైందని, మంగళవారం తెల్లవారుజాము నుంచి వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



గాయపడిన బాలకృష్ణ

పాణ్యం: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు హైవే పెట్రోలింగ్ సిబ్బంది సోమవారం తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన బాలకృష్ణ బైక్‌పై వస్తుండగా ఎదురుగా నంద్యాల వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో అతని కాలికి తీవ్ర గాయమైంది. అక్కడున్న వారు చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. హైవే అధికారులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

స్పందనతో సమస్యల పరిష్కారం

సి.బెళగల్: ప్రజలు అర్జీల రూపంలో ఇచ్చిన సమస్యలను మండల, గ్రామస్థాయి అధికారులు వెంటనే పరిష్కారం అయ్యేలా చూడాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ సూచించారు. సోమవారం తన కార్యాలయంలో మండల అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు పొలం సమస్యలు, పంట బీమా, ఇళ్ల పట్టాల సమస్యపై అధికారులకు అర్జీలు ఇచ్చారు. స్పందన అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓ రాముడుతో కలిసి మండల, గ్రామస్థాయి అధికారులతో పెండింగ్ సమస్యలు, స్పందన అర్జీలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. స్పందనతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈఓఆర్డీ సందీప్, ఏఓ మల్లేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఎంఈఓ జ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, హౌసింగ్, విద్యుత్ ఏఈలు గోనేనాయక్, సూర్యప్రకాష్, సుమంత్, సుకుమార్ వైకేపీ ఏపీఎం వెంకటస్వామి, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

కోడుమూరురూరల్: స్పందనలో భాగంగా ప్రజలు, రైతుల నుంచి వచ్చే సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ శేషఫణి తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి ఆయా సమస్యలపై వినతులను స్వీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల నుంచి భూసమస్యలపై వచ్చే అర్జీలను పరిశీలించి తగిన ఆధారాలను తెప్పించుకుని పరిష్కరించాలని వీఆర్వోలను ఆదేశించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఏడుకొండలు, ఏఈ ప్రసాద్, ఏపీఎం పుష్పావతి, ఈఓఆర్డీ మంజుల, హౌసింగ్ ఏఈ ఫారుక్‌హుసేన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

పాణ్యం: నవధాన్యాల సాగుతో రైతులకు లాభాలతో పాటు నేల మరింత సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ రీజనల్ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరేంద్రారెడ్డి అన్నారు. సోమవారం పాణ్యంలోని పొదుపు భవన్‌లో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సమావేశం నిర్వహించి, నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమిలో సేంద్రియ కర్బణం పెరగాలంటే నవధాన్యాల సాగు ఒక్కటే మార్గమన్నారు. పచ్చిరొట్ట ఎరువులు, 30 రకాల జాతులు విత్తన గుళికలను తయారు చేసుకునేందుకు విత్తన కిట్లను అందజేశామన్నారు. నవధాన్యాలు సాగుచేసే రైతులు ఎకరానికి 13 కేజీల విత్తన గుళికలను ఉపయోగించుకోవాలన్నారు. డీపీఎం సలాం, ఏపీఎం ప్రసాద్, విజయభాస్కర్, నాగరాజు, పుల్లయ్య, కరీముల్లా, సిసింద్రి, శివకుమార్, ఆచారి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు నవధాన్యాల కిట్లు అందిస్తున్న రిజినల్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, డీపీఎం నరేంద్రారెడ్డి

హమాలీలకు కూలి ఇప్పించండి

కోడుమూరు రూరల్: డీలర్లకు గత రెండు నెలల నుంచి రేషన్ బియ్యం దింపిన కూలీలను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీలు సోమవారం కోడుమూరు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి రాజు మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు సోషల్‌యాక్టివ్ కింద హమాలీ కూలీలు ఇవ్వలేమని, ప్రభుత్వమే హమాలీల కూలీలు ఇవ్వాలని కోరడంతో అధికారులు బిల్లులు పెట్టి హమాలీల కూలీలు ఇస్తామన్నారన్నారు. అయితే 2 నెలలు గడిచినా హమాలీలకు రేషన్ దుకాణాలకు బియ్యం దింపిన కూలీలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి బిల్లులు మంజూరు చేయాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రాముడు, హమాలీ సంఘం నాయకులు బాలరాజు, శివుడు ఉన్నారు.



తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తొలిరోజు ప్రశాంతం

సి.బెళగల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలవ్యాప్తంగా నాలుగు పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 240 మంది విద్యార్థులకు, కొత్తకోట జెడ్పీ హైస్కూల్‌లో 288 మంది, ఏపీ మోడల్ స్కూల్‌లో 250 మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 190 మంది రెగ్యులర్ విద్యార్థులతో మొత్తం 768 మంది రెగ్యులర్ విద్యార్థులు, 193 మంది ప్రైవేట్ విద్యార్థులతో కలుపుకుని 961 మందికి పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు ఉదయాన్నే ఆలయాలలో పూజలుచేసి పరీక్షకు తరలివెళ్లారు.

– మండలానికి ఫ్లైయింగ్ స్క్వాడ్‌గా వచ్చిన కర్నూలు డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి హనుమంతరావు తన బృందంతో కలిసి సి.బెళగల్ జెడ్పీ, గురుకుల పాఠశాల, మోడల్ స్కూళ్లను తనిఖీ చేసి, పరీక్ష నిర్వహణను పరిశీలించారు. అలాగే కోడుమూరు సీఐ శ్రీధర్, స్థానిక ఎస్ఐ పీరయ్య, ఎంఈఓ జ్యోతి పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు మండలంలో ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

కోడుమూరు రూరల్: కోడుమూరు, లద్దగిరిలోని 5 పరీక్ష కేంద్రాల్లో జరిగిన తెలుగు పరీక్షకు మొత్తం 1082 మంది విద్యార్థులకు గాను 1064 మంది హాజరుకాగా, 18 మంది గైర్హాజరయ్యారు. కోడుమూరులోని బాలుర హైస్కూల్‌లో 242 మందికి 237 మంది, బాలికల హైస్కూల్‌లో 239 మందికి 234 మంది, మోడల్ స్కూల్‌లో 238 మందికి 231మంది, లద్దగిరి ఏసెంటర్‌లో 183 మందికి 182 మంది, బీ సెంటర్‌లో 175 మందికి 175 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు శ్రీనివాస్‌యాదవ్, నాగరాజకుమారి, గురుప్రసాద్ రెడ్డి, దూలసాహెబ్, కెఎల్‌వీఎస్ఎస్.ప్రసాద్ తెలియజేశారు.

గూడూరు: గూడూరు పట్టణంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా జెడ్పీ బాలురోన్నత పాఠశాల కేంద్రంలో 264 మంది విద్యార్థులకు గాను ఇద్దరు, జెడ్పీ బాలికోన్నత పాఠశాల కేంద్రంలో 271 మంది విద్యార్థులకుగాను ఇద్దరు గైర్హాజరైనట్లు ఎంఈఓ సునీలమ్మ తెలిపారు.

పాణ్యం: మండలంలో సోమవారం జరిగిన పదో తరగతి మొదటి పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎఈంఓ కోటయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మొత్తం 949 మంది పరీక్ష రాయల్సి ఉండగా 938 మంది హాజరైనట్లు చెప్పారు. పాణ్యం ఉన్నత పాఠశాలలో 270 మందికిగాను 268, ఎస్టీ గిరిజన బాలికల పాఠశాలలో 227 మందికిగాను 223, బీసీ బాలికల పాఠశాల నెరవాడలో 232 మందికిగాను 228, బలపనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 220 మందికిగాను 219 మంది హాజరైనట్లు చెప్పారు.

గడివేముల: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు నంద్యాల జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ రఘురామిరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక జెడ్పీ స్కూల్ సెంటర్, ఏపీ మోడల్ స్కూల్ సెంటర్లను పరిశీలించారు. ప్రతి సెంటర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎంఈఓ రామకృష్ణ రెండు పరీక్ష కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 987 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 977 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా కాల్వబుగ్గ గరుకుల పాఠశాలలో 260 మందికి ముగ్గురు, ఓర్వకల్లు జెడ్పీ హైస్కూల్‌లో 240 మందికి ఐదుగురు, లొద్దిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 227 మందికి ఒక్కరు, ఏపీ మోడల్ స్కూల్‌లో 260 మందికి ఒక్కరు గైర్హాజరైనట్లు ఎంఈఓ సునంద పేర్కొన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.



సి.బెళగల్ పోలీస్ స్టేషన్ నుంచి ప్రశ్న పత్రాలను తీసుకెళుతున్న పరీక్షల నిర్వాహకులు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని 33 పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి తొలిపరీక్ష పకడ్బందీగా నిర్వహించామని కర్నూలు ఎంఈఓ విజయభాస్కర్ తెలిపారు. సోమవారం కర్నూలు మండలం గొందిపర్ల – వసంతనగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సిట్టింగ్ స్క్వాడ్ డ్యూటీలో ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రానికి ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారు? ఏర్పాట్లపై ఆరా తీశారు. ఎంఈఓ మాట్లాడుతూ మండల పరిధిలోని 10వ తరగతి పరీక్షలకు రెగ్యూలర్, ప్రైవేట్ పరంగా 6,712 విద్యార్థులకు గానూ 6,652 మంది విద్యార్థులు హాజరయ్యారని, 60 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. క్రిటికల్ సెంటర్‌గా ఉన్న గొందిపర్ల – వసంతనగర్ జిల్లా పరిషత్ హైస్కూల్ సెంటర్‌కు టు టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి పదవ తరగతి పరీక్షా పేపర్‌ను ప్రత్యేక వాహనంలో తీసుకువచ్చామని అన్నారు. విద్యార్థులు మాస్ కాపింగ్‌కు పాల్పడకుండా గట్టి పోలీసు బందోబస్తు మధ్య పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు.



సి.బెళగల్ మోడల్ స్కూల్‌లో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు



కోడుమూరు బాలికల హైస్కూల్లో పరీక్ష గదిని చూసుకుంటున్న విద్యార్థులు



గడివేములలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న మహిళా పోలీసులు

ఢిల్లీకి తరలిన కార్మిక సంఘాలు

కర్నూలు(సెంట్రల్): ఏప్రిల్ 5న ఢిల్లీలో చేపట్టిన నిరసనలో పాల్గొనేందుకు జిల్లా నుంచి కార్మిక, కర్షక నాయకులు తరలివెళ్లారు. కార్మిక కర్షక భవన్ నుంచి ఒక గ్రూపు, ఓల్డ్‌సిటీ నుంచి మరో గ్రూపు ప్రదర్శనగా రైల్వేస్టేషన్ చేరుకున్నాయి. వారిని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నాయకులు సాగనంపారు.

కుర్రకారూ.. ఏమిటీ తీరు?



బైక్‌పై ఐదుగురు విద్యార్థులు వెళ్తున్న దృశ్యం

గడివేముల: మోటార్ సైకిల్‌పై ఐదుగురు.. అందరూ పదోతరగతి విద్యార్థులే.. ఇలాంటి ప్రయాణం ప్రమాదకరం అని తెలిసినా పిల్లలలో మార్పు రావడం లేదు. బైకు నడపాలనే ఆశతో నేటి తరం కుర్రకారు తల్లితండ్రుల మాటలను లెక్కచేయక ఏడ్చి, అలిగి, బెదిరించి బైకును కొని ట్రాఫిక్ రూల్స్ కుడా తెలియకుండా, తలకు హెల్మెట్ అయినా పెట్టుకోకుండా, స్నేహితులను ఎక్కించుకుని రయ్‌రయ్ మని దూసుకుపోతూ ప్రమాదాల భారిన పడి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలిస్తున్నారు. ఇద్దరు వెళ్లాల్సిన బైకుపై ఐదుగురు కూర్చుని సోమవారం నంద్యాల–నందికొట్కూరు రోడ్డుపై గడివేములలోని హైస్కూల్ వద్ద వెళుతుండగా సాక్షి కెమరాకు చిక్కారు.

వరికి భలే డిమాండ్

- గతంలో ఎన్నడూ లేని విధంగా ధర
- మార్కెట్‌లో బస్తా రూ.1650
- దిగుబడులతో రైతుకు ఊరట

పాణ్యం: వరి సాగు అంటేనే రైతులకు ఎంతో శ్రమతో పాటు అధికంగా నీటిని తీసుకునే పంట. మారుతున్న కాలానుగుణంగా పెట్టుబడి అధికంగా ఖర్చు అయ్యే పంట కూడా. చాలా మంది రైతులు నీటి వసతి అధికంగా ఉంటే ముందుగా వరి పంటనే సాగు చేస్తారు. ఎందుకంటే కుటుంబ అవసరం కోసం. అలాంటి పంటను సాగు చేసే రైతులకు కేవలం వానకారు దిగుబడే అంతోఇంతో లాభాలను తెచ్చిపెడుతుంది. గత కొన్నేళ్లుగా ఎండకారు పంటకు అనుకున్నంత మద్దతు ధర లభించకపోవడంతో వ్యాపారుల ధరల ప్రకారం రైతులు విక్రయిస్తుంటారు. అలాంటిది ఈఏడు ఎండకారు పంటకు కూడా వానకారుతో పాటు సమానంగా బస్తా రూ.1650 ప్రకారం మార్కెట్‌లో మద్దత్తు ధర పలుకుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో అధికంగా ఎస్సార్బీసీ ఆయకట్టు, బోర్ల కింద వరి పంటను సాగు చేస్తారు. గత ఖరీఫ్‌లో మండలంలో 3,620 హెక్టార్లలో వరి పంటను రైతులు సాగు చేశారు. ఇక రబీ (ఎండకారు)లో 3,026 హెక్టార్లలో వరి సాగు చేశారు. ప్రస్తుతం కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలో కొండజుటూరు, గోరుకల్లు, పాణ్యం, ఆలమూరు, కొణిదేడు, గోనవరం గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి.



కొండజుటూరులో మిషన్‌తో వరి కోస్తున్న దృశ్యం

నీరు పుష్కలం

మండలంలో దాదాపుగా 50 శాతం పొలాలకు ఎస్సార్బీసీ కాల్వ ద్వారా నీరు అందుతుంది. గోరుకల్లు జలాశయంలో గత ఏడాది 11 టీఎంసీల నీటిని నిల్వ చేయడంతో దిగువన ఉన్న పాణ్యం, బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల, గోస్పాడు, నంద్యాల, సంజామల మండలాలకు పుష్కలంగా నీటిని అందించారు. దీనికి తోడు బోర్లు, బావులు, కుంటల కింద కూడా సాగుచేశారు. దీంతో రైతులకు నీటి సమస్య లేకుండా పోయింది. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముందు చూపు అధికారుల సూచనలతో గోరుకల్లులో నీటి నిల్వకు సాధ్యమైంది.

ఆశాజనకంగా ధర

ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ధరలు పెరగడం సాధారణం. రబీలో సాగుచేసిన వరి పంటకు ధర రోజురోజుకు తగ్గిపోతుంది. అలాంటిది ఈసారి ఏకంగా బస్తా రూ.1600–1650 వరకు పలుకుతుండడంతో రైతుల్లో సంతోషం నెలకొంది. ధర ఇలానే కొనసాగాలని రైతులు కోరుకుంటున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంటకు బస్తా రూ.1600 వరకు పలికింది. క్రమంగా బస్తా రూ.1400కు చేరి స్థిరంగా నిలబడింది. అయితే ప్రస్తుతం రబీ పంటకు ఒకేసారి రూ.1650 వరకు పలుకుతుండడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మిస్సింగ్ కేసు నమోదు



బండారి సురేష్ (ఫైల్)

గూడూరు రూరల్: కే.నాగులాపురం పోలీస్ స్టేషన్‌లో యువకుడి మిస్సింగ్ కేసు నమోదైనట్లు సోమవారం ఎస్ఐ సోమ్లానాయక్ తెలిపారు. వివరాలు.. పర్ల గ్రామానికి చెందిన కురువ నారాయణ కుమారుడు బండారి సురేష్ (34) గత నెల 23న కారు (ఏపీ 26 ఏడబ్ల్యూ1583)లో ఇంటి నుంచి బెంగళూరుకు ఇంటర్వ్యూ నిమిత్తం వెళ్లాడు. గత నెల 30వ తేదీ వరకు ఫోన్‌లో మాట్లాడాడు. ఆ తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. ఇంతవరకు ఇంటికి రాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నేడు ఆసరా వారోత్సవాలు

కల్లూరు: కల్లూరు అర్బన్ 32, 33, 34, 35వ వార్డుల పొదుపు సంఘాల మహిళలకు మంగళవారం సాయంత్రం నిర్మల్‌నగర్‌లోని పార్కులో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మెప్మా అధికారులు హాజరుకానున్నట్లు వెల్లడించారు.